# ఉత్తమోత్తమ నాటకం ' ప్రజా నాయకుడు ప్రకాశం '

– దుగ్గిరాల సోమేశ్వరరావు

"ప్రజానాయకుడు ప్రకాశం" నాటకకర్త దర్శకులు ఆచార్య మొదలి నాగభూషణశర్మగారు సామాన్యులు కారు. సాహితీ సాంస్కృతిక రంగాలలో ఆరితేరిన మహనీయులు. స్వగ్రామంలోను, బందరు, గుడివాడ, హైదరాబాద్ లలోను విద్యాభ్యాసం చేసి ఆంగ్లంలో ఎమ్.ఎ.,పిహెచ్.డి. పట్టాలు పొంది; ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఆంగ్ల అధ్యాపకులుగా ఉద్యోగం ప్రారంభించారు. అమెరికా ఇల్లినాయ్ విశ్వవిద్యాలయంలో రంగస్థల దర్శకత్వం ప్రధానాంశంగా ఎం.ఎఫ్.ఎ డిగ్రీ పొందారు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో రంగస్థలశాఖను ప్రారంభించి దానికి ప్రథమాచార్యులుగా; ఉస్మానియా, కేంద్ర విశ్వవిద్యాలయాలలో రంగస్థలశాఖలకు అధ్యక్షుడుగా బాధ్యతలు నిర్వహించి, అనేకమంది యువతీయువకులకు ఆయా శాఖలలో శిక్షణనిచ్చి వారిని నటులుగా, దర్శకులుగా, సాంకేతిక నిపుణులుగా తీర్చిదిద్దారు.

తెలుగు నాటకరంగంలో నాటక రచయితలు చాలామందే ఉన్నారు. అలాగే దర్శకులు కూడా. నాటక రచన, దర్శకత్వం – ఈ రెండు విభాగాలలో – ఆరితేరినవారు చాలా అరుదు. అలా అరుదైనవారిలో ఆచార్య నాగభూషణశర్మగారు అగ్రగణ్యులు. కొన్ని పరభాషా నాటకాలను తెలుగులోకి అనువదించి, తెలుగులోనే కొన్ని నాటకాలు, నాటికలు రచించి మొత్తం 12 నాటకాలు, 25 నాటికలు తన దర్శకత్వంలో ప్రదర్శించి, ప్రశంసలు పొందిన ప్రతిభాశాలి శ్రీ శర్మగారు. నాటకాలను ప్రయోగాత్మకంగా ప్రదర్శించటంలో నిష్ణాతులు వీరు. జాతీయంగా, అంతర్జాతీయంగా ఎన్నో ప్రతిష్ఠాత్మక పురస్కారాలు అందుకున్న ఘనులు శ్రీ శర్మగారు.

ఆచార్య మొదలి నాగభూషణశర్మగారు వ్రాసి, తన దర్శకత్వంలో ప్రదర్శించి, మన్ననలు పొందిన సుప్రసిద్ధ నాటకాలలో "ప్రజానాయకుడు ప్రకాశం" ఒకటి. ఈ నాటకం గురించి ...........

ఒక ప్రముఖ సమకాలీన రాజకీయ నాయకుడి గురించి నాటకం వ్రాయడం సాహసమే! అందులోనూ జీవితాంతం రాజకీయ ప్రత్యర్థులతో సంఘర్షణలను కొనసాగించిన ప్రకాశం పంతులుగారి జీవితం ఆధారంగా నాటకం వ్రాయడం అసిధారా వ్రతమే! అటువంటి సాహసాన్ని, అసిధారా వ్రతాన్ని విజయవంతంగా నిర్వహించారు ఆచార్య మొదలి నాగభూషణ శర్మగారు.


ఒక అతి పేదవాడైన వ్యక్తి స్వయంకృషితో, పట్టుదలతో ఎంత ఉన్నతికి రావచ్చునో తెలియచేయటానికి ప్రస్తుత రాజకీయ సమరాంగణం వల్ల సమాజానికి ఎంత ముప్పో తెలియచెప్పటానికి ఒక ఆధారం ప్రకాశంగారి జీవితం. దీనికి సంబంధించిన వివరాలన్నీ క్రోడీకరించి నాటకంగా వ్రాయాలని అప్పట్లో దాదాపు అయిదారు సంవత్సరాలు శ్రీ శర్మగారు మథనపడ్డారు. ప్రకాశంగారి "నా జీవనయాత్ర" గ్రంథాన్ని, ప్రకాశంగారి మీద వచ్చిన దాదాపు అన్ని రచనలని అధ్యయనం చేశారు. ప్రకాశంగారి జీవితాన్ని సన్నిహితంగా గమనించిన వారిని, ఆయన జీవిత సంఘటనలను ఐతిహ్యాలుగా చెప్పుకొనేవారిని కలిసి వారి అభిప్రాయాలు సేకరించారు. ఇంతటి శ్రమదమాదులకోర్చి దాదాపు సంవత్సర కాలంలో (1998 – 99) – "ప్రజానాయకుడు ప్రకాశం" నాటకరచన

పూర్తిచేశారు శ్రీ శర్మగారు. ఈ నాటకాన్ని వారి దర్శకత్వంలోనే ప్రప్రథమంగా 'రసరంజని', హైదరాబాదులో 1999 ఆగస్టు 23వ తేదీన ప్రదర్శించారు.

ఈ నాటకాన్ని 52 పాత్రలతో, 27 మంది సాంకేతికవర్గంతో, 15 దృశ్యాలలో రూపుదిద్దటం జరిగింది. బాల్యంలో (1884) ప్రకాశంగారు (పాత్రధారి సురభి బాలిక) ఒంగోలులో విద్యాభ్యాసం చేస్తూ నాటకాలలో నటించేవారు. తమ్ముడు శ్రీరాములు (సురభి బాలిక), తల్లి సుబ్బమ్మగారు (బుర్రా సుబ్రహ్మణ్యశాస్త్రి) ఒంగోలులో పూటకూళ్లు పెడుతూ బిడ్డలను పోషిస్తూ ఉండేవారు. గురువు ఇమ్మనేని హనుమంతరావు నాయుడుగారు (దుగ్గిరాల సోమేశ్వరరావు) ప్రకాశం మీద మమకారంతో, తల్లి సుబ్బమ్మగారికి చెప్పి ప్రకాశాన్ని చేరదీస్తారు. బావమరిది అయినాల తాతయ్యానాయుడుగారి (కె.వి. శాస్త్రి) సలహా మీద, హనుమంతరావునాయుడుగారు ఒంగోలు నుండి రాజమండ్రికి మారతారు. 1886లో గురువుగారిని చూడటానికి రాజమండ్రి వెళ్లిన ప్రకాశం, ఆయన కోరిక మీద రాజమండ్రిలోనే ఉండిపోతారు. ఆతర్వాత న్యాయవిద్యను అభ్యసించటానికి ప్రకాశం II (నడిమింటి జగ్గారావు) 1892లో మద్రాసు వెడతారు. అక్కడనుండి బారిస్టర్ స్వామినాథన్ ప్రోత్సాహంతో బార్.ఎట్.లా. చదవాలని 1904లో ఇంగ్లండ్ వెడతారు. 1905లో లండన్ నుండి సెలవలకు మద్రాసు వచ్చిన ప్రకాశంగారిని సనాతన సమాజం వెలివేస్తుంది. దాన్ని లెక్కచేయకుండా ప్రకాశంగారు స్పందిస్తారు. 1908లో తల్లి సుబ్బమ్మగారి మరణం ప్రకాశంగారిని, తమ్ముడు శ్రీరాములు II (పింగళి గంగాధరరావు) గారిని బాధిస్తుంది.

తదుపరి మద్రాసులో న్యాయవాద వృత్తిలో కొనసాగుతూ, ఉన్నతస్థానంలో ఉన్న ప్రకాశం III గారు (చాట్ల శ్రీరాములు) 1921లో గాంధీజిగారి పిలుపుమేరకు తన న్యాయవాద వృత్తికి స్వస్తి చెప్పి, రాజకీయాలకు అంకితమవుతారు. 1928లో సైమన్ కమిషన్ వచ్చినప్పుడు, దాన్ని వ్యతిరేకిస్తూ, కాల్చుకొమ్మని తన గుండెలను చూపిస్తారు ప్రకాశంగారు. 1930లో ఉప్పు సత్యాగ్రహాన్ని నడిపించారు. 1946లో నాయకత్వం నుండి విరమించుకోమని ఢిల్లీ పెద్దలు ఒత్తిడిపెట్టినప్పుడు, నిరాకరించి ప్రకాశంగారు నాయకుడిగా ఎన్నికయ్యారు. 1946–47లో మద్రాసు ప్రధానిగా ఉన్న ప్రకాశంగారు రాజాజీ (ముట్నూరి కామేశ్వరరావు) గారితో సంఘర్షణ, వ్యతిరేకశక్తుల వల్ల ఇబ్బందులు పడ్డారు. 1952లో ఆంధ్రరాష్ట్ర సమస్య గురించి పట్టాభి (గోపరాజు రమణ) గారు, ప్రకాశంగార్ల మధ్య సంఘర్షణ జరిగింది. 1953లో ఆంధ్రరాష్ట్ర ముఖ్యమంత్రిగా ప్రకాశంగారు కర్నూలులో బాధ్యతలు స్వీకరించారు. 1956లో హైదరాబాద్‌లో శివసాయుజ్యం పొందారు.

పైన చెప్పిన సంఘటనలను "ప్రజానాయకుడు ప్రకాశం" నాటకం రచనలోను, ప్రదర్శనలోను అమోఘంగా తీర్చిదిద్దారు శ్రీ శర్మగారు. ఈ నాటకంలోని 52 పాత్రలలో 2 కథకుల పాత్రలున్నాయి. ఈ కథకులు దృశ్యానికి, దృశ్యానికి మధ్య వివరాలు చెపుతూ ఉంటారు. ఈ రెండు పాత్రలను శ్రీ మొదలి నాగభూషణశర్మగారు, అప్పట్లో తెలుగు విశ్వవిద్యాలయం ఉపకులపతి శ్రీ జి.వి. సుబ్రహ్మణ్యంగారు పోషిస్తూ ఉండేవారు. మిగిలిన పాత్రలను యం. ఫ్రాన్సిస్, బి. నారాయణ, యస్. మోహన్, గరిమెళ్ల రామమూర్తి, బి. ఆనందమోహన్, బి.పి. ప్రసాద్, క్రమధాటి వెంకటేశ్వరశర్మ, భాగి శివశంకరశాస్త్రి, బి.హెచ్. కల్యాణి, సురభి శ్యామల మొదలైన అందరూ కూడా పాత్రోచితంగా చక్కగా నటించి, ప్రదర్శనలను విజయవంతం చేసేవారు. పాత్రధారుల ఎంపిక వల్ల, రూపశిల్ప నైపుణ్యం వల్ల పాత్రధారులందరూ అచ్చు ఆయా ఒరిజినల్ పాత్రల (నాయకుల) లానే కనిపించేవారు.



తెల్లవాడి తుపాకీకి గుండె చూపిస్తున్న ప్రకాశం పంతులు (పాత్రధారి చాట్ల శ్రీరాములు)



ప్రకాశం పంతులు తల్లిపాత్రలో బుర్రా సుబ్రహ్మణ్యం

"ప్రజానాయకుడు ప్రకాశం" ప్రజల్లోకి వెళ్లడానికి మరో ముఖ్యకారణం కుటుంబ, రాజకీయ జీవితాలకు మధ్యలో ప్రకాశంగారు పాల్గొన్న ఉద్యమ సన్నివేశాలు. సైమన్ కమిషన్‌కు వ్యతిరేక పోరాటం, ఉప్పుసత్యాగ్రహ ఉద్యమాలను శర్మగారు ఆనాడు ప్రసిద్ధిచెందిన పాటలతో నింపివేశారు. "మాకొద్దీ తెల్లదొరతనము" అన్న గరిమెళ్లవారి పాట, నాటకానికే హైలైట్. సైమన్ కమిషన్ వ్యతిరేక పోరాటంలో పోలీసులు కాలుస్తానంటే ప్రకాశం గుండె చూపించి "కాల్చురా" అన్నాడు. అటువంటి సన్నివేశాలన్నీ, ఆటపాటలతో నాటకాన్ని యింకా రసభరితం చేశాయి.

రసరంజని ఈ నాటకాన్ని హైదరాబాద్, న్యూఢిల్లీ, ముంబై, వైజాగ్, రాజమండ్రి, ఏలూరు, విజయవాడ, గుంటూరు, ఒంగోలు, తిరుపతి పట్టణాలలో 25 ప్రదర్శన లిచ్చి ప్రేక్షక మహాశయుల ప్రశంసలు పొందింది.

"ప్రజానాయకుడు" నాటకం ప్రదర్శనలు చూసిన పాత్రికేయులు, ప్రేక్షకమహాశయుల అభిప్రాయాలు.... నభూతో నభవిష్యతిగా జరిగిన ప్రదర్శన – అడుగడుగునా ఉత్తేజపరచిన ప్రజానాయకుడు ప్రకాశం – ఆద్యంతం ఆకట్టుకున్న నాటక ప్రదర్శన – దాదాపు 80 మంది కళాకారులు, సాంకేతిక నిపుణులు, క్రమశిక్షణతో ఈ నాటకం ప్రదర్శించిన తీరు అపూర్వం. కన్నుల పండుగగా ఉంది. ఈ నాటకం చూడటం ఒక అనుభూతి. సుబ్రహ్మణ్యశాస్త్రి ప్రకాశంతల్లిగా స్వాభిమానం, అనురాగం, అసహాయత ముప్పేటగా తల్లి పాత్రకు ప్రాణంపోసారు. ఈ పాత్ర మరణ సన్నివేశంలో శాస్త్రిగారి నటన వర్ణనాతీతం. దుగ్గిరాల సోమేశ్వరరావు హనుమంతరావునాయుడి పాత్రలో ప్రకాశం మీద ఉండే శిష్యవాత్సల్యంతోపాటు ఆ పాత్ర రాజసాన్ని అద్భుతంగా చూపించారు. ప్రకాశం పాత్రను చాట్ల శ్రీరాములు ఎంతో చాకచక్యంగా పోషించారు. సైమన్ కమిషన్ ముందు గుండెలు చూపి కాల్చుకోమన్న ఘట్టంలో రౌద్రరసాన్ని, టంగుటూరి సూర్యకుమారి తనను చూడటానికి వచ్చిన ఘట్టంలో కరుణరసాన్ని చక్కగా పొలికించారు చాట్ల శ్రీరాములు. పాత్రధారులంతా పాత్రలకు జీవంపోశారు. సాంకేతిక నిపుణుల సహకారం నాటకానికి రసపుష్టి కలిగించింది.

"ప్రజానాయకుడు ప్రకాశం" నాటకం ఇంత ఘనత వహించటానికి మూలం ఈ నాటక రచయిత, దర్శకులు ఆచార్య మొదలి నాగభూషణ శర్మగారు. భవిష్యత్తులో శ్రీ శర్మగారు మరిన్ని ఉత్తమ నాటకాలు వ్రాయాలని, వారు, వారి కుటుంబసభ్యులు ఆయురారోగ్య సౌభాగ్యాలతో శతాధిక సంవత్సరాలు వర్ధిల్లాలని ఆ భగవంతుని ప్రార్థిస్తూ, వారికి నా హృదయపూర్వక అభినందనలు, శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను.